మాజీ సైనికులకు వెన్నంటి ఉంటాం

సప్తగిరి కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 23: మాజీ సైనికులకు సంబంధించి ఎక్కడ ఎలాంటి ఇబ్బంది ఉన్నా నగరపాలక సంస్థ వెన్నంటి ఉండి సమస్యలు తీరుస్తుందని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. సోమవారం 35వ డివిజన్ సప్తగిరి కాలనీలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, మాజీ సైనికులతో కలిసి గతంలో ప్రభుత్వం కేటాయించిన 12 గుంటల స్థలంలో రూ.1.52 కోట్లతో చేపట్టనున్న ఈహెచ్ఎస్ పాలీ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పాలి క్లీనిక్ ఏర్పాటు వల్ల మాజీ సైనికులు, వారి కుటుంబాలకు వైద్యం మరింత చేరువవుతుందని తెలిపారు. త్వరలోనే ఈ భవనంలోనే క్యాంటిన్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. కిసాన్‌నగర్ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందించాలని మాజీ సైనికులు కోరారని, దీనిపై నగరపాలక సంస్థ పాలకవర్గంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్, మాజీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డిఫెన్స్ అధికారులు వికాస్ సింగ్, నారాయణ రెడ్డి, డెనిల్, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

గంగాధర పోలీస్‌స్టేషన్‌లో సీపీ తనిఖీ

రాంనగర్/గంగాధర, డిసెంబర్ 23: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని గంగాధర పోలీస్ స్టేషన్‌ను సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసి వాటికి గల కారణాలు తెలుసుకుని, త్వరగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో గంగాధర పోలీస్‌స్టేషన్ ఎస్.హెచ్.ఓ. ఎస్సై నరేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

గణిత నమూనాలు పరిశీలిస్తున్న శేఖర్ రావు తదితరులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 23 : జిల్లా కేంద్రంలోని కట్టరాంపూర్ కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు, ముఖ్య అతిథులుగా ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చునూరి సురేందర్, కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ, మానవ నాగరికత గణితంతో ముడిపడి ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ గణితంలో ముందంజలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో 125 గణిత ప్రాజెక్టులు తయారుచేసిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్, ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

సర్కారు బడికి చేయూత

మానకొండూర్, డిసెంబర్ 23: చెంజర్ల గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బోళ్ల రాణాప్రతాప్ జ్ఞాపకార్థం ఆయన కుమార్తె అపర్ణ మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాల అభివృద్ధికి చేయూతనందించారు. లండన్ దేశంలో ఉద్యోగం చేస్తున్న ఆమె, 21,252 రూపాయలను తన సోదరుడు లెనిన్ ద్వారా సోమవారం పాఠశాల హెచ్ఎం డీ శ్రీనివాస్‌కు అందజేశారు.

ప్రజా'వాణి'.. వినిపించుకోరు!

- సకాలంలో రాని అధికారులు
- కొంతమంది మొత్తమే గైర్హాజరు
- కార్యక్రమం మొక్కుబడిగా మారుతున్నదనే విమర్శలు

కలెక్టరేట్, డిసెంబర్ 23: ప్రజావాణిలో తామిచ్చిన అర్జీలను అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఒకే సమస్యపై రెండు, మూడు సార్లు దరఖాస్తులు ఇచ్చినా పరిష్కార మార్గాలు చూపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యలపై సంబంధిత అధికారులను నేరుగా ప్రశ్నించేందుకు ఉన్నతాధికారులు పిలిస్తే కార్యక్రమానికి రాకపోవడంతో అర్జీదారులు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలు చేయకుండా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తుండడంతో, ప్రజావాణి కార్యక్రమం క్రమేపి మొక్కుబడి తంతుగా మారుతున్నదనే ఆవేదన ఫిర్యాదుదారుల నుంచి వ్యక్తమవుతున్నది. కొన్ని విషయాల్లో తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడంతో తిరిగి అవే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. కాగా, సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 333 దరఖాస్తులు రాగా, వాటిని స్వీకరించిన ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ సమస్య చెప్పుకొంటున్న వృద్ధుడిని వారిస్తున్న గన్‌మెన్

ప్రజావాణిలో గన్‌మెన్ల అత్యుత్సాహం

ప్రజావాణి కార్యక్రమంలో ఉన్నతాధికారులను కలిసేందుకు వస్తున్న తాము పడరాని పాట్లు పడుతున్నామని అర్జీదారులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేసి, తమ సమస్యలు వారికి చెప్పుకొనేందుకు ప్రయత్నిస్తుండగానే కొందరు గన్‌మెన్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ, తమను వెనుకకు నెట్టివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అర్జీదారులు వరుసక్రమంలో రావడానికి స్టీల్‌రోప్ బారికేడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో రెవెన్యూ సిబ్బంది వారిని వరుస క్రమంలో పంపించాలి. అయితే, ఇందుకు బదులు గన్‌మెన్లకు పని పురమాయించడంతో అధికారుల ఎదుట హల్‌చల్ చేస్తూ, దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు అర్జీదారులు కన్నీటి పర్యంతమయ్యారు. కనీసం కలెక్టర్‌కు కూడా అర్జీ అందజేయకుండా, తమవద్ద నుంచి గన్‌మెన్ తీసుకుని తమను వెనక్కు పంపించాడని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న పెద్దన్నల కులస్తులు

పెద్దన్నల కులానికి చెందిన మా 120 కుటుంబాలు యాభై ఏండ్ల నుంచి ఆరెపల్లి గ్రామంలో నివసిస్తున్నయి. మేము ఇప్పటివరకు ఇండ్ల స్థలాలకు నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక మాకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిత్తమని, మా ఓట్లేయించుకున్నరు. గవర్నమెంటు వచ్చి యాడాదైపోయింది. మమ్ములను పట్టించుకున్నోళ్లు లేరు. ఊరికొసకు దేరా లేసుకుని ఉంటన్నం. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు కూడా పెట్టుకున్నం. అధికారులు సర్వే చేస్తున్నరట. కానీ, మాదిక్కు మాత్రం ఎవ్వలూ రాలే. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టరమ్మకు దరఖాస్తు ఇచ్చినం.

- పెద్దన్నల కులస్తులు, ఆరెపల్లి, కరీంనగర్

మా ఇండ్లకు దారి ఏర్పాటు చేయాలి

కరీంనగర్ రూరల్ మండలం ముగ్దుంపూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను మాకు ఇచ్చారు. మేము రోడ్డుకు వచ్చి, తిరిగి ఇండ్లకు వెళ్లేందుకు దారి లేదు. అధికారులు పోసిన రోడ్డును కొంతమంది ఆక్రమించుకున్నరు. మేమడుగుతే వాళ్లు డబ్బులియ్యలేదు. మీరు ఇవ్వాలి అని అంటున్నరు. బాట కోసం అధికారుల దగ్గరికి ఆరు నెలల నుంచి వస్తున్నం. దరఖాస్తులు ఇస్తున్నం. ఎవలూ పట్టించుకుంటలేరు. కలెక్టరమ్మ వచ్చే దాక ఉండి.. ఇయ్యాల్ల మల్లోటి దరఖాస్తు ఇచ్చినం. మాకు బాట ఇయ్యకపోతే మల్లో సారి వచ్చి ఇక్కన్నే ఉంటం.

-ముగ్దుంపూర్ డబుల్ బెడ్రూం కాలనీవాసులు

సమాజంలో సామరస్యం వెల్లివిరియాలి

క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, డిసెంబర్ 23: సమాజంలో సామరస్యం వెల్లివిరియాలంటే యేసు బోధనలను ఆచరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ కాలనీలోని అరుంధతీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి ముందస్తు క్రిస్మస్ వేడుకలు అధికారికంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రేమ భావాన్ని, సేవా తత్పరతను, క్షమాగుణాన్ని క్రీస్తు బోధించారని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు విజయ్ కుమార్, బత్తుల భాస్కర్, ఫారుఖ్, నరేందర్, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ముదుగంటికి ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 23 : తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డికి ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలో జరిగే ఆరో ప్రపంచ తెలుగు మహాసభలకు అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్ ఆహ్వానం పంపించారు. ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనాలు, పుస్తక పరిచయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రంథ సమీక్షలు నిర్వహిస్తారు.

సామూహిక అనఘాష్టమి వ్రతం

సదాశివపల్లిలో సామూహిక అనఘాష్టమి వ్రతం చేస్తున్న భక్తులు

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 23: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లిలో సోమవారం గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో గణపతి సచ్చిదానంద ఆశ్రమ ట్రస్టు, జయలక్ష్మీ మాత మాతృమండలి కరీంనగర్, పద్మ అమ్మవార్ల ఆధ్వర్యంలో సామూహిక అనఘాష్టమి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వ్రతంలో దాదాపు 200 మంది దత్త భక్తులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

డీవైడీఎం కార్యక్రమానికి స్పందన

తెలంగాణచౌక్, డిసెంబర్ 23: కరీంనగర్ డిపో-2 కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిపో పరిధిలోని పలు గ్రామాల నుంచి 24 మంది ప్రయాణికులు తమ సమస్యలను డీఎం మల్లయ్య దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

భిక్షాటనతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

కమాన్‌చౌరస్తా/ కలెక్టరేట్, డిసెంబర్ 23 : 'ధర్మం చేయండి... ధర్మం చేయండి అంటూ'.. భిక్షాటనతో ఎస్ఎస్ఏ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ 14వ రోజు రోడ్ల వెంట తిరుగుతూ భిక్షం అడిగారు. 14 రోజు సమ్మెకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, టీజీపీఎస్ చైర్మన్ కాళీ చరణ్, టీఎన్జీవో జిల్లా సెక్రెటరీ సంగెం లక్ష్మణరావు, వైస్ ప్రెసిడెంట్ రోహిత్, కేశవ రెడ్డి కిరణ్ కుమార్, రమేశ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామస్వామి, వెంకన్న, రాగి శ్రీనివాస్, అంజయ్య, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పువ్వులు సత్యనారాయణ, రిటైర్డ్ టీచర్లు రాజేశ్వరరావు, మహేశ్, రమేశ్, తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫోరం ఫౌండర్ అండ్ స్టేట్ ప్రెసిడెంట్ మాసం రత్నాకర్, సత్యం, రమేశ్ సంఘీభావం తెలిపారు.

పీవీ నరసింహారావు సేవలు మరువలేనివి

తెలంగాణచౌక్, డిసెంబర్ 23: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు కొనియాడారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం పీవీ 20 వర్ధంతి సందర్భంగా, నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వాలు ఆర్గానిక్ సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతుల అందిస్తున్న బీమా వయోపరిమితిని 59 సంవత్సరాల నుంచి 69 సంవత్సరాలకు పెంచాలన్నారు. రైతులందరికీ రూ.5వేల పెన్షన్‌తోపాటు హెల్త్ కార్డులను అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు స్వామిరెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మణమూర్తి, కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

కలెక్టరేట్, డిసెంబర్ 23 : మాజీ ప్రధాని పాములపర్తి వెంకటనర్సింహారావు వర్ధంతిని నగరంలోని టీజీఏ జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి.ఓంప్రసాద్, జాతీయ రైతు సంఘాల అధ్యక్షుడు పి.రామారావు, తెలంగాణ ఉద్యమకారులు, గ్రాడ్యుయేట్ల సంఘం ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, ప్రేమ్‌కుమార్, సంపత్‌కుమార్, గోపీకృష్ణ, గడప కోటేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆహారపదార్థాల్లో రంగులు, ఫ్లేవర్స్ వాడకుండా చర్యలు చేపట్టాలి

కలెక్టరేట్, డిసెంబర్ 23 : క్రిస్మస్, నూతన సంవత్సరం నేపథ్యంలో విరివిగా వినియోగించే ఆహార పదార్థాల తయారీలో బేకరీలు, రెస్టారెంట్లు, హోటళ్లు, మిఠాయిదుకాణాలు, పాస్ట్రీపుడ్ సెంటర్లు రంగులు, ఫ్లేవర్స్ వాడకుండా చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ని కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. మోతాదుకు మించి వినియోగించే ఫ్లేవర్స్ మూలంగా క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాలు కూడా వస్తున్నాయని, వీటిని పరిగణనలోకి తీసుకుని ఆహార తనిఖీ అధికారులను అప్రమత్తం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన కమిషనర్ జిల్లా ఆహార తనిఖీ అధికారి అనూషకు ఫోన్ చేయగా, తనిఖీలు చేస్తామని తెలిపినట్లు వెల్లడించారు.

కలెక్టరేట్ ఆడిటోరియంలో క్రిస్మస్ వేడుకలు

కలెక్టరేట్/కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 23: క్రిస్మస్‌ను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పలువురు క్రైస్తవ ప్రముఖులతో కలిసి ముందస్తు వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొని కేకు కోశారు. క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్, జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో ఆడిటోరియం సమీపంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ కార్నివాల్‌ను సందర్శించారు. ఎగ్జిబిట్లను చూసి సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రశంసించారు. ఆమె వెంట బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు తయారుచేసిన పలు వస్తువులు కొనుగోలు చేసి, ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

కార్యదర్శులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట, డిసెంబర్23: నాగంపేట గ్రామ పంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని, ఆర్టీఐ దరఖాస్తు చేస్తే గ్రామ కార్యదర్శి ఒకరైతే.. బదిలీపై వెళ్లిన కార్యదర్శి సమాధానాలివ్వడంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసాచారి అనే వ్యక్తి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయని అందులో పేర్కొన్నారు. అంతేకాకుండా కార్యదర్శులిద్దరికీ మండలస్థాయి అధికారులు సహకరిస్తున్నారని, గతంలో ఇల్లందకుంటలో పనిచేసిన సమయంలో ఎంపీవో వెంకటేశ్వర్లు అధికార దుర్వినియోగంపై దృష్టి సారించాలని ఫిర్యాదులో కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వీణవంక, డిసెంబర్ 23: ప్రమాదవశాత్తు మంటల్లో పడి తీవ్రగాయాలపాలైన వృద్ధుడు, చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన చల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తోట తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరు గ్రామానికి చెందిన మత్తమారి ఓదెలు (73) ఈ నెల 13న గ్రామ శివారులో గల వ్యవసాయ భూమిలోని బావి వద్ద నీటి పైపులు అతికించేందుకు చిన్నమంట పెట్టాడు. పక్కనే ఉన్న ఎండుగడ్డిపై నిప్పురవ్వలు పడడంతో ఒక్కసారిగా మంటలు లేవగా, ప్రమాదవశాత్తు ఓదెలు కాలుజారి మంటల్లో పడ్డాడు. బట్టలు, శరీరం సగం కాలిపోగా వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఓదెలు భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారిణుల సత్తా

కొత్తపల్లి, డిసెంబర్ 23 : రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో గెలుపే లక్ష్యంగా జిల్లాకు చెందిన జట్టు క్రీడాకారిణులు సత్తాచాటుతున్నారు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో అద్భుత విజయం సాధించి క్వార్టర్స్ పోరుకు దూసుకువెళ్లారు. హైదరాబాద్‌లోని హకీంపేటలో ఈ నెల 22 నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న జిల్లాకు చెందిన మహిళా జట్టు క్రీడాకారిణులు, మొదటిపోరులో హైదరాబాద్ జట్టుపై 31-13 తేడాతో విజయం సాధించారు. రెండో పోరులో ఆదిలాబాద్‌పై పోటీపడగా, అందులో 34-15 తేడాతో విజయం సాధించి సత్తాచాటారు. అలాగే హనుమకొండ జట్టుతో జరిగిన పోటీల్లో 47-21 తేడాతో విజయం సాధించి క్వార్టర్‌కు దూసుకువెళ్లారు. ఆడిన ప్రతి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధిస్తూ పతకమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న క్రీడాకారిణులను కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అమిత్ కుమార్, కార్యదర్శి మల్లేశ్ గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ సంపత్‌రావు, కోచ్ పద్మ అభినందించారు.

పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం

శంకరపట్నం, డిసెంబర్ 23: నిరుపేదలకు న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మోరె గణేశ్ అన్నారు. మొలంగూర్ గ్రామంలోని 378, 703 సర్వే నంబర్లలో గల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనా తగిన చర్యలు చేపట్టడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని సోమవారం కలెక్టర్ కార్యాలయ ముట్టడికి బయలుదేరిన గణేశ్‌ను కేశవపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికైనా తహసీల్దార్, సర్వేయర్‌తో సర్వే జరిపించి ఆక్రమణదారుల చెరనుంచి ప్రభుత్వ భూమిని విడిపించాలన్నారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ దాసారపు భద్రయ్య, అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు అంతడ్పుల సతీశ్, తదితరులు మద్దతుగా కలెక్టరేట్‌కు బయలుదేరగా వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

కొత్తపల్లి, డిసెంబర్ 23 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ ఆధ్వర్యంలో దత్తత గ్రామం కొత్తపల్లిలోని నాగులమల్యాలలో జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత మాట్లాడుతూ, వాతావరణాన్ని కాపాడుకుంటూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం మిట్ట లక్ష్మయ్యను సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధుకర్‌రావు, ఉషారాణి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా. రాజేంద్ర ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి, ఎఫ్ఎంసీ కంపెనీ సిబ్బంది క్రాంతి, సుమారు 52 మంది రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

పాస్ పోర్టు పోయినది

అల్లూరి సాయికేశవరెడ్డి S/o.అల్లూరి శ్రీనివాసరెడ్డి మం॥ మల్యాల గారికి సంబంధించిన P9300564 నంబర్ గల పాస్‌పోర్టు జగిత్యాల జిల్లా మల్యాలలో అంగడి బజారు దారిలో వెకుండగా బైక్ పై నుండి పడిపోయినది ఇది దొరికిన వారు మాకు తెలియజేయగలరని మనవి. దొరికిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును. అల్లూరి సాయి కేశవరెడ్డి, 14-2-90/A కొత్తపేట్ ఏరియా మల్యాల జగిత్యాల.

సెల్: 8639219836

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు వెల్ది విద్యార్థి

కె. రాంచరణ్

కొత్తపల్లి, డిసెంబర్ 23 : బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈనెల 28 నుంచి 30 వరకు జరుగనున్న 68వ జాతీయస్థాయి రగ్బీ పోటీలకు జిల్లాలోని వెల్ది జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి కె. రాంచరణ్ ఎంపికై నట్లు పాఠశాల పీడీ ఎండీ యూనిస్ పాషా పేర్కొన్నారు. నవంబర్ 10 నుంచి 12 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొన్న రాంచరణ్ సత్తాచాటి, జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని డీఈవో జనార్దన్‌రావు, హెచ్ఎం ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మార్కెట్‌కు సెలవులు

జమ్మికుంట, డిసెంబర్ 23: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు రేపు, ఎల్లుండి సెలవని, రైతులు గమనించాలని కార్యదర్శి మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం క్రిస్మస్, గురువారం బాక్సింగ్ డే సందర్భంగా రెండు రోజులు మార్కెట్ బంద్ ఉంటుందని పేర్కొన్నారు. రైతులెవరూ తమ ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. తిరిగి శుక్రవారం మార్కెట్ పునఃప్రారంభమవుతుందని తెలిపారు. కాగా, మార్కెట్ యార్డులో కార్యదర్శి ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం పలువురు రైతులను ఘనంగా సన్మానించారు. ఇక్కడ ద్వితీయ శ్రేణి కార్యదర్శి రాజా, మార్కెట్ సిబ్బంది, ఖరీదుదారులు, అడ్తిదారులు, గుమస్తాలు, హమాలీ కార్మికులు, రైతులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వీణవంక, డిసెంబర్ 23: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు గురుకుంట్ల రాకేశ్ ఈ నెల 18న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, సోమవారం బాధిత కుటుంబ సభ్యులను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ పరామర్శించారు. ధర్మ సమాజ్ పార్టీ అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్ మహారాజ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ మహారాజ్, జంబుద్వీప జనజాగృతి బాధ్యుడు అంజన్‌బాబు, ఆయా జిల్లాల నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో అన్నదానం

విద్యానగర్, డిసెంబర్ 23 : మెడికవర్ హాస్పిటల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ జన్మదినం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సుమారు వెయ్యి మందికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటల అల్పాహారం, అన్నదాన కార